క్లుప్తంగా

గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

ఖమ్మంరూరల్: మండలంలోని కోదాడ క్రాస్‌రోడ్‌లో గల సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో అన్ని గ్రూపులకు ప్రవేశాలు ప్రారంభమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి. ఝాన్సీరాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీజీయూజీ సెట్ రాసి అర్హత సాధించిన విద్యార్థినులు సంబంధిత వివరాలతో కళాశాలలో జూన్ 3న సంప్రదించాలని సూచించారు. పదో తరగతి మెమో, ఇంటర్ హాల్ టికెట్, మెమో, టీజీయూజీ సెట్ 2023 హాల్ టికెట్, కుల, ఆదాయ, బోనఫైడ్ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, అయిదు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకు రావాలని పేర్కొన్నారు.

న్యాయవాదులకు క్రికెట్ పోటీలు

ఖమ్మంలీగల్: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ న్యాయవాదులకు క్రికెట్ పోటీలు (పురుషులు, మహిళలకు విడివిడిగా) ఏర్పాటు చేసినట్లు బార్ అసోసియేషన్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీ రావుల వెంకట్ తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటలకు జిల్లా కోర్టు పక్కన ఉన్న సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. క్రీడాకారులకు ఉదయం అల్పాహారం, భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కామేపల్లి ఎస్సైపై ఏసీపీకి ఫిర్యాదు

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి ఎస్సైపై కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నాయకులు రాంరెడ్డి గోపాల్‌రెడ్డి తదితరులు శనివారం ఏసీపీకి ఫిర్యాదు చేశారు. పోలీసుస్టేషన్‌లో చేసే ఫిర్యాదులు పట్టించుకోవడం లేదని, చోరీలు జరిగినా ఘటనాస్థలాల్లో పరిశీలించకపోగా హెడ్ కానిస్టేబుల్ చెప్పినట్లు నడుచుకుంటున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గింజల నర్సింహారెడ్డి, నాయకులు రాంరెడ్డి జగన్నాథరెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, దమ్మాలపాటి సత్యనారాయణ, రడబోతు గోపిరెడిడ, మద్దినేని రమేష్ పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలకు రోజుకు రూ.272 ఇవ్వాలి

నేలకొండపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసే కూలీలకు రోజుకు రూ.272 కూలి అందేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని మోటాపురం , చెరువుమాధారంలో శనివారం ఉపాధి కూలీల పని ప్రదేశాలను సందర్శించిన సందర్భంగా వారు మాట్లాడారు. ఈ సందర్భంగా కూలీలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సీపీఎం ప్రతినిధి బృందానికి వివరించారు. ఉపాధి కూలీలకు శ్రమకు తగ్గిన ఫలితం అందాలని, దూరం ప్రదేశంలో పని జరిగితే వారికి అలవెన్స్‌లు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు ప్రమాదం జరిగినప్పుడు చేసే ప్రాథమిక చికిత్సకు మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. మండుటెండల్లో పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు బీరెడ్డి యాకయ్య, పాలకుర్తి స్వామి, లక్ష్మయ్య, భూక్యా జ్యోతి, నారయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	కస్టడీ
వినోద	2018
సాయిరాం	మళ్లీ పెళ్లి
ఆదిత్య	బిచ్చగాడు 2
శ్రీనివాస	మేమ్ ఫేమస్
సుందర్	ది కేరళ స్టోరీ

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	2
వంకాయ	26		10
బెండకాయ	24	పాలకూర	3
పచ్చిమిర్చి	60		10
కాకర	40	చుక్కకూర	2
సొర	18		10
బీర	36	తోటకూర	2
దొండ	26		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	24	కొత్తిమీర	1
ఆలుగడ్డ	26		15
చామగడ్డ	40	పుదీన	1
క్యారెట్	46		15
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

పచ్చడి మామిడి పసందు..!

మార్కెట్‌లో పలు రకాల్లో కాయలు లభ్యం

- జోరుగా సాగుతున్న అమ్మకాలు
- రకం, సైజ్ ఆధారంగా ధరలు
- కాయలు, క్లీనింగ్, ముక్కలు అంతా ఒకే చోట
- ప్రతి ఇంటా పచ్చడి ఘుమఘుమలు

సండే స్పెషల్



కాల్వొడ్డులో కొన్న మామిడి కాయలను ముక్కలుగా కట్ చేయిస్తున్న మహిళ

ఖమ్మంవ్యవసాయం: వేసవి కాలం వచ్చిందంటే మామిడి పచ్చడి పెట్టడం ఆనవాయితీగా వస్తోంది. ప్రస్తుతం పచ్చడి మామిడి కాయల సీజన్ కావడంతో మార్కెట్‌లో విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మామిడి కాయ పచ్చడి ప్రతి ఒక్కరికి నోరూరుతుంది కావునా వేసవిలో మే, జూన్ మాసాల్లో మామిడి కాయ పచ్చడిని ప్రతి ఇంటా పెట్టుకుంటారు. మామిడి పండ్లను ఎంత ప్రియంగా తింటామో.. అదేరీతిలో మామిడి కాయ పచ్చడిని సైతం తినడానికి ప్రత్యేకంగా తెలుగు రాష్ట్రాల ప్రజలు ఇష్టపడతారు. మామిడి కాయల సీజన్ కావడంతో ఎక్కువ కాలం నిల్వ ఉండే పచ్చడి కాయల రకాలను కొందరు నేరుగా తోటల వద్ద కొనుగోలు చేస్తుంటే.. మరి కొందరు మార్కెట్లో కొని పచ్చడి పెట్టుకుంటున్నారు. ఇక ఖమ్మం నగరంలో ప్రధానంగా కాల్వొడ్డు ప్రాంతం పచ్చడి మామిడి కాయల విక్రయాలకు కేంద్రంగా ఉంది. ఇలా ప్రతి ఇంటా మామిడి పచ్చడితో ఘుమఘుమలు వస్తున్నాయి.

పలు రకాల్లో కాయలు..

ఖమ్మం పరిసర ప్రాంతాల్లో లభించే రకాలు జలాలు, తెల్ల గులాబీలు, రసాలు, నీలాలను పచ్చడిగా పెట్టుకుంటారు. పచ్చడి మామిడి కాయలకు నూజివీడు, విసన్నపేట ప్రాంతాలు పెట్టింది పేరు. అంతేగాక సత్తుపల్లి, అశ్వారావుపేట, కల్లూరు, తల్లాడ, మధిర, ముదిగొండ, తిరుమలాయపాలెం, చింతకాని, కూసుమంచి, రఘునాథపాలెం మండలాలు తదితర ప్రాంతాల్లో కూడా మామిడి పండ్ల రకాలతో పాటు పచ్చడి మామిడి కాయలను కూడా పండిస్తున్నారు.

రకం, సైజ్‌ను బట్టి ధర..

పచ్చడి మామిడి కాయల రకం, సైజ్ ఆధారంగా ధరలను నిర్ణయించి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నూజివీడు, విసన్నపేట ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన కాయలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో జలాలు రకం ఒక్కో మామిడి కాయ ధర



ఓ ఇంట్లో పచ్చడి పెడుతున్న మహిళలు

రూ. 40లు, తెల్లగులాబీ రూ. 30లు, చిన్న రసాలు రూ. 20లు, నీలాలు రూ. 15ల వరకు ధర పలుకుతోంది. కాయ సైజ్ తగ్గితే ధర కొంత మేరకు తగ్గొచ్చు.



కోరుకున్న సైజ్‌లో ముక్కలు..

పచ్చడి కాయలు కొనుగోలు చేసే చోటనే ఆ కాయలను కడిగి, శుభ్రంచేసి, తుడవడంతో పాటు ఆర బెట్టి కోరుకున్న సైజ్‌లో ముక్కలు కట్ చేసి అప్పగిస్తున్నారు. కాయ ధర గాక ఇతర చార్జీలను ఒక్కో కాయకు సైజును బట్టి రూ. 5 నుంచి రూ. 10ల వరకు తీసుకుంటున్నారు.

వేసవిలో ప్రత్యేకం..



వేసవిలో ఏడాది పాటు నిల్వ ఉండేలా నీలాల రకాలను ఎంచుకొని ప్రత్యేక జాగ్రత్తలు పాటిస్తూ పచ్చడి పెడతాం. ఇలా తయారు చేసిన పచ్చడిని తమతో పాటు దేశ, విదేశాల్లో ఉన్న కూతురు, కొడుకు కుటుంబాలకు పంపిస్తాం. దీని కోసం వారు ప్రత్యేకంగా ఎదురుచూస్తుంటారు. మామిడి నిల్వ పచ్చడి అంటే బాగా ఇష్టం.

– ఆనం శాంతకుమారి, ఇందిరానగర్

కాయకు దెబ్బ తగలనివ్వం..



చెట్టుపై ఉన్న కాయలకు దెబ్బ తగలకుండా పచ్చడికి అవసరమైన మామిడి రకాలను కోయించి విక్రయిస్తుంటాం. దెబ్బతిన్న కాయలను విక్రయిస్తే పచ్చడి చెడిపోతుంది. ఈ ఏడాది ఈదురు గాలులకు కాయలు రాలిపోవడంతో కాయలకు డిమాండ్ ఉంది. మా వద్దే కాయలను కడిగి ముక్కలుగా కట్ చేసి ఇస్తున్నాం.

– పుగాకుల రమ, విక్రయదారురాలు, కాల్వొడ్డు

ఇంట్లో తయారీ ప్రత్యేకం..

వేసవి సీజన్‌లో మామిడి కాయ పచ్చడి ఇంటి వద్ద పెట్టడం కొందరికి ఆనవాయితీ. ముందుగా పచ్చడికి ప్రత్యేకంగా అవసరమైన మిరప కాయలను ఎంచుకొని కారం పట్టిస్తారు. ఆతర్వాత ఆవపిండి, ఉప్పు, ఎల్లిపాయలు, పసుపు, మెంతులు, నూనె తదితరాలను సిద్ధంగా పెట్టుకొని పచ్చడి పెట్టుకుంటున్నారు. కొందరు ఏడాది పొడవునా వినియోగించుకునేందుకు పెద్ద పెద్ద జాడీల్లో పచ్చడిని పెట్టి నిల్వ బెడుతున్నారు.

'సహకార' సభ్యుల సంక్షేమమే లక్ష్యం



బోదులబండలో చెక్కు అందిస్తున్న చైర్మన్ కాశయ్య

నేలకొండపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యుల సంక్షేమమే పాలకవర్గం లక్ష్యమని బోదులబండ సొసైటీ చైర్మన్ అనంతు కాశయ్య పేర్కొన్నారు. శనివారం మండలంలోని బోదులబండ సొసైటీ పరిధిలో ఇటీవల మృతి చెందిన పలువురు కుటుంబాలకు మంజూరైన సొసైటీ బీమా చెక్కులను అందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కోరట్లగూడెంలో వెంకటేశ్వర్లు, బోదులబండలో శంకర్‌రావులు ఇటీవల మృతి చెందడంతో బీమా కింద మంజూరైన రూ.50వేల చెక్కులను కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి డీసీసీబీ బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ గోపిరెడ్డి, సొసైటీ సీఈఓ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జూన్ 10న పట్టాల పంపిణీకి శ్రీకారం



మాట్లాడుతున్న తహసీల్దార్ దారా ప్రసాద్

నేలకొండపల్లి: మండలంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేసేందుకు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు తహసీల్దార్ దారా ప్రసాద్ చర్యలు చేపట్టారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 10న నిరుపేదలకు 75 గజాల ఇంటి స్థలాల చొప్పున పట్టాలు పంపిణీ చేసేందుకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో శనివారం ఆయా గ్రామాల్లో స్థలాలను తహసీల్దార్‌తో పాటు మండల సర్వేయర్ రాజశేఖర్‌లు సందర్శించి హద్దులు ఏర్పాటు చేయించి లేఅవుట్ ప్రక్రియను చేపట్టారు. ఇందులో భాగంగా మండలంలోని సధాశివాపురం, రామచంద్రాపురం, నాచేపల్లి, శంకరగిరితండా, మోటాపురం, అప్పలనరసింహాపురం గ్రామాల్లో ప్రభుత్వ భూమి 8 ఎకరాలను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనల మేరకు నిరుపేదలకు ఇంటి పట్టాలు అందించనున్నట్లు తెలిపారు.

'శ్రీరక్ష'లో సీపీఆర్‌పై అవగాహన



మాట్లాడుతున్న వైద్యుడు సత్యనారాయణరెడ్డి

ఖమ్మం వైద్యవిభాగం: నగరంలోని శ్రీరక్ష ఆస్పత్రిలో ఎమర్జన్సీ మెడిసిన్ దినోత్సవం సందర్భంగా శనివారం సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి మేనేజ్‌మెంట్ డాక్టర్ జి.వెంకటేశ్వర్లు(జీవీ మాట్లాడుతూ.. సరిత క్లినిక్ బాధ్యులు డాక్టర్ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు సతీష్‌చౌదరి, మానస, ఏడుకొండలు, సురేంద్రరెడ్డి, వెంకటేష్, రాజ్‌కుమార్, కాశీ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాధాకృష్ణమూర్తికి గౌరవ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న రాధాకృష్ణమూర్తి

నేలకొండపల్లి: మండలంలోని మంగాపురం తండాకు చెందిన హ్యూమన్ రైట్స్ ప్రెసిడెంట్ ధీరవత్ రాధాకృష్ణమూర్తికి గౌరవ డాక్టరేట్ లభించింది. ఆయన చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఇంటర్నేషనల్ గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ బాధ్యులు డాక్టరేట్ ప్రకటించగా, ఢిల్లీలో శనివారం జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ వ్యవస్థాపకులు పి.మనుయేలు, తమిళనాడుకు చెందిన సంపత్‌కుమార్ తదితరులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.

సంజీవరావుకు విశిష్ట సేవారత్న..



అవార్డు అందుకుంటున్న సంజీవరావు

రఘునాథపాలెం: మండలంలోని మంచుకొండకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ మహాసేన జిల్లా అధ్యక్షుడు మంద సంజీవరావు విశిష్ట సేవా రత్న అవార్డు అందుకున్నారు. ఎస్ఎస్‌బీఎం సంస్థ ప్రకటించిన ఈ అవార్డును గోవాలో జరిగిన కార్యక్రమంలో ఆయనకు జాతీయ అధ్యక్షుడు కొంగర అనిల్‌కుమార్ బహూకరించి సన్మానించారు. ఈకార్యక్రమంలో జిల్లా నుంచి దేవరకొండ కల్యాణి, లేగల జీవరత్నం, మారపాక పృథ్వీ, మంద విజయరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి

ఖమ్మంరూరల్: అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు సాయం అందించాలని, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని చెప్పి ఇంతవరకు ఒక్కరికీ ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కళ్లెం వెంకటరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన ఎన్నికల హామీలు కేవలం హామీలుగానే మిగిలిపోతున్నాయని, తొమ్మిదేళ్ల తెలంగాణ పాలనలో ఏ ఒక్కరికీ న్యాయం చేయలేదని పేర్కొన్నారు. ప్రధానంగా రైతు రుణమాఫీ చేయకపోవడంతో రైతులకు బ్యాంక్‌ల్లో అప్పులు పెరిగి తీసుకున్న అసలు కంటే వడ్డీలే ఎక్కువై మరింత అప్పుల పాలవుతున్నారని తెలిపారు. వెంటనే ఇచ్చిన హామీలన్నీ పూర్తి చేయాలని పేర్కొన్నారు.

ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు



ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న అధికారులు

కూసుమంచి: మండలంలోని నర్సింహులగూడెం -2, తురకగూడెం ఎత్తిపోతల పథకాలకు మరమ్మతు పనులు చేపట్టినట్లు శనివారం నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. పాలేరు రిజర్వాయర్ బ్యాక్ వాటర్ ఆధారంగా ఈ పథకాల ద్వారా పలు చెరువులను నింపనున్నారు. నీటిపారుదల శాఖ అధికారులు నిరుపయోగంగా మారిన ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు చేయాలని పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం స్పందించి రూ.19లక్షలను కేటాయించింది. దీంతో డీఈఈ బాణాల రమేష్‌రెడ్డి ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌ల ఏర్పాటు, ఏయిర్ వాల్వ్‌లు, పైప్‌లైన్ లీకేజీలు తదితర పనులను చేపట్టారు. వారంలోగా ఈ పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందిస్తామని డీఈఈ తెలిపారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు డివిజన్‌లలో సుడా నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మేయర్ పునుకొల్లు నీరజ శనివారం సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ కృషితో 46, 47, 48 డివిజన్‌లలో రూ.60 లక్షలతో సీసీ రోడ్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న కృష్ణ, మాటేటి అరుణ, తోట ధనమ్మ రామారావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆర్‌జేసీ కృష్ణ, డీఈ స్వరూపరాణి, ఏఈ నవ్యజ్యోతి, శ్యాం మనోహర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ కొండల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే తరఫున నూతన వస్త్రాలు



వస్త్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సతీమణి, కుమార్తె

కూసుమంచి: మండలంలోని రాజుపేట గ్రామంలో వచ్చే నెల 1 నుంచి 3వ తేదీ వరకు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ ప్రారంభం, విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాలను పురస్కరించుకుని గ్రామానికి చెందిన ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కుటుంబసభ్యులు నూతన వస్త్రాలు అందజేశారు. ఎమ్మెల్యే సతీమణి విజయమ్మ, కుమార్తె దీపికారెడ్డి చేతుల మీదుగా గ్రామంలో ఇంటింటికి నూతన వస్త్రాలను అందించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్టీఆర్‌ను ప్రజల గుండెల్లో బతకనివ్వండి



మాట్లాడుతున్న అయితగాని శ్రీనివాస్‌గౌడ్

ఖమ్మం మామిళ్లగూడెం: సినీపరిశ్రమలో తన నటనతో పాటు రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న ఎన్టీ రామారావును ప్రజల గుండెల్లో బతకనివ్వాలని బీఎస్పీ ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్ హితవుపలికారు. శనివారం ఎన్టీఆర్ శత జయంతిని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఎన్టీఆర్ చలన చిత్రరంగంలో ఉన్నప్పుడే గౌతమ బుద్ధుడు, జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయుల చరిత్రను అధ్యాయనం చేసి, వారి మార్గంలో పయనించాలనే సంకల్పంతో రాజకీయాల్లోకి అరంగేట్రం చేశారని గుర్తు చేశారు. ఎన్టీఆర్ విగ్రహం పేరుతో కుల రాజకీయాలు చేయడం మంచిదికాదన్నారు. కేసీఆర్ అంబేడ్కర్ జయంతి రోజే దళిత సంక్షేమ పథకాలు ప్రారంభించినప్పటికీ.. అవి ఆరంభ సూరత్వంగా ప్రారంభించబడి, ఉత్సవ విగ్రహాలుగా మూలన పడ్డాయని పేర్కొన్నారు.

భానుడి భగభగ.. జనం విలవిల

భానుడి ప్రతాపానికి జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. ఎక్కడ నీడ కనిపించినా కాసేపు సేదదీరేందుకు ప్రయాణికులు ఆసక్తి కనబరుస్తున్నారు. శనివారం కూడా ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ఇదిగో ఇలా మొఖాలకు రక్షణ చర్యలు తీసుకుంటూ ప్రయాణిస్తున్నారు. ఈ దృశ్యాలను 'సాక్షి' కెమెరా క్లిక్ అనిపించింది. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్



'ప్రజా గర్జన'ను జయప్రదం చేయండి



నేలకొండపల్లి: మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్



ఖమ్మంరూరల్: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

నేలకొండపల్లి/ ఖమ్మంమయూరిసెంటర్/ఖమ్మం రూరల్/కూసుమంచి: మతోన్మాదుల నుంచి దేశ పరిరక్షణ, ప్రజాసమస్యల పరిష్కారం కోసం జూన్ 4న సీపీఐ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజాగర్జన బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చి జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యుడు మిడకంటి చినవెంకటరెడ్డి పార్టీ మండల కార్యదర్శి భూక్య నర్సింహా పిలుపునిచ్చారు. శనివారం నేలకొండపల్లి మండలకేంద్రంలో కర్నాటి కృష్ణయ్య భవన్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పోటు ప్రసాద్, ఖమ్మం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సీపీఐ టూటౌన్ కమిటీ సమావేశంలో మహ్మద్ సలాం, ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో సభకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా వెంకటరెడ్డి, కూసుమంచి మండలం లాల్‌సింగ్‌తండాలో సభ పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా భూక్యా నర్సింహా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తున్నాయని, ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను పరిష్కరించడం లేదని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెట్టి లబ్ధి పొందాలని చూస్తుందని, కార్పొరేట్ల కోసం పేద, మధ్య తరగతి ప్రజలపై భారాలు మోపుతుందన్నారు. రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలకు కార్యోన్ముఖులను చేసేందుకు లక్ష మందితో కొత్తగూడెంలో నిర్వహిస్తున్న ఈ సభకు జాతీయ కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ నాయకులు కె.నారాయణ, చాడ వెంకటరెడ్డి, ఆజీజ్ పాషా, పువ్వాడ నాగేశ్వరరావు, వందేమాతరం శ్రీనివాస్‌లు పాల్గొంటారని తెలిపారు. నేలకొండపల్లిలో జరిగిన కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొనగా.. బోడ వీరన్న అధ్యక్షతన ఖమ్మంలో జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాసరావు, నగర సహాయ కార్యదర్శి యానాలి సాంబశివరెడిడ, ఎస్‌కె.సైదా, చానా తదితరులు పాల్గొన్నారు. అలాగే, వరంగల్ క్రాస్‌రోడ్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెరుకుపల్లి భాస్కర్, వెంపటి సురేందర్, పి.రామకృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొనగా.. కూసుమంచి మండలం లాల్‌సింగ్‌తండాలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లేష్, మండల నాయకులు శ్రీకాంత్, ప్రసాద్,నాగు, శంకర్, రవిందర్ తదితరులు పాల్గొన్నారు.